పాత బస్టాండుపై వివాదం..!

చిత్తూరు నగర నడిబొడ్డున ఉన్న కాను బ్రహ్మానందరెడ్డి మునిసిపల్ బస్టాండుపై వివాదం రాజుకుంది. కార్పొరేషన్ అధికారులు, ఇక్కడ ఉన్న పక్కా భవనాల దుకాణ దారుల నడుమ ప్రతిష్టంభన నెలకొంది. బస్టాండు మొత్తం తమది అంటూ కార్పొరేషన్ అధికారులు.. బస్టాండులో పట్టా ఉన్న పక్కా భవనాల దుకాణాలపై మీ పెత్తనం ఏమిటని దుకాణాల నిర్వాహకులు కారాలు మిరియాలు నూరుతున్నారు.

- దుకాణాలన్నీ ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారుల ఆదేశం
- షాపింగ్ కాంప్లెక్సు నిర్మించాలని ఆలోచన
- పట్టా ఉన్న భవనాలపై పెత్తనం ఏమిటని మండిపడుతున్న వ్యాపారులు
- చిత్తూరు షాప్ కీపర్స్ అసోసియేషన్ పేరిట ఆందోళనకు సమాయత్తం
- అధికారుల వైఖరిని ఎండగడుతూ సోషల్ మీడియాలో పోస్టింగ్స్
- ప్రభుత్వానికి అప్రతిష్ట తెస్తున్నారని రాజకీయ పార్టీల మండిపాటు



పాత బస్టాండులోని దుకాణాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ పాత బస్టాండులో పదేళ్ల క్రితం బస్సుల రాకపోకలు సాగించేవి. ఇక్కడ మునిసిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్సు, ప్రైవేటు కాంప్లెక్సులు ఉపయోగంలో ఉండేవి. అప్పటి ఎమ్మెల్యే సత్యప్రభ (టీడీపీ) ఇక్కడున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సును కూల్చేసి, దాని స్థానంలో అధునాత సముదాయం నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. దీంతో కార్పొరేషన్ అధికారులు అప్పటికే ఉన్న మునిసిపల్ కాంప్లెక్సును కూల్చేసి, బస్టాండును అక్కడి నుంచి తొలగించి ఎన్టీఆర్ బస్టాండుకు తరలించారు. అప్పటి నుంచి బస్సుల రాకపోకలు ఆగిపోవడంతో పాత బస్టాండు కళ తప్పింది. కానీ అప్పటికే బస్టాండు చుట్టూ ఉన్న కొన్ని పక్కా దుకాణాలను నిర్వాహకులు యధావిధిగా కొనసాగించుకునే వాళ్లు. తాజాగా బస్టాండులో ఉన్న తోపుడు బళ్ల వ్యాపారులు, కూరగాయలు విక్రయించేవాళ్లను కార్పొరేషన్ అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఇక్కడ అధునాతన వాణిజ్య సముదాయం నిర్మించడానికి ప్రతిపాదనలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇదే సమయంలో బస్టాండులో దీర్ఘకాలంగా పక్కా దుకాణాలు నిర్వహించుకున్న భవనాలు కూడా మునిసిపాలిటీకు చెందినవని, వీటిని కూడా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఇదే వివాదానికి కారణమవుతోంది.

ఇవి మాకు సొంతం

బస్టాండు లోపల ఉన్న పక్కా భవనాల్లోని దుకాణాలన్నీ తమకు చెందినవేనంటూ పలువురు వ్యాపారులు ఆందోళనకు దిగారు. ఈ స్థలానికి, మునిసిపాలిటీకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా అందరూ కలిసి చిత్తూరు షాపు కీపర్స్ అసోసియేషన్ పేరిట ఆందోళనకు సమాయత్తమవుతున్నారు. భవనాలకు కూల్చి వేయడానికి చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ న్యాయస్థానం నుంచి కె-వియట్ తెచ్చుకున్నట్లు ఆరోపిస్తున్నారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మొండిగా ముందుకు వెళితే నిరాహారదీక్షకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తున్నారు. మరోవైపు బీజేపీ, జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు సోషల్ మీడియా వేదికగా కార్పొరేషన్ అధికారుల వైఖరి ఎండగడుతున్నారు. అధికారుల వైఖరి మార్చుకోవాలని, ఇది ప్రభుత్వానికి అప్రతిష్ట తెస్తోందని పోస్టులు పెడుతున్నారు. అభివృద్ధి పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు వెళతారో..? వ్యాపారుల సెంటిమెంట్ గౌరవిస్తారో చూడాలిక.



చిత్తూరులోని కాసు బ్రహ్మానందరెడ్డి మునిసిపల్ బస్టాండు (ఫైల్)



షాపింగ్ కాంప్లెక్సు కోసం మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

క్లుప్తంగా

స్మార్ట్ లాక్స్‌పై అవగాహన



స్మార్ట్ లాక్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

యాదమరి (కాణిపాకం): యాదమరి మండలంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐ ఈశ్వర్ స్మార్ట్ లాక్స్‌పై అవగాహన కల్పించారు. చోరీల నివారణకు ఈ స్మార్ట్ లాక్స్ ఉపయోగపడుతాయని, అవసరమైన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే వీటిని ఇస్తామన్నారు. ప్రజలు స్మార్ట్ లాక్స్ ఏర్పాటు చేసుకుని తమ ఇళ్లలో చోరీలు జరగకుండా చెక్ పెట్టవచ్చన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యపై 'వినతిపత్రాల పోరు'



స్థానికులతో సమావేశమైన నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: అరు పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 10న అర్హులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. గురువారం నగరంలోని చామంతిపురంలో స్థానికులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని కూటమి ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చిన పాపాన పోలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 8 నెలలైనా పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం సరికాదని నిరసన వ్యక్తం చేశారు. ఇల్ల స్థలాల సమస్యపై పార్టీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో సమావేశమై వినతి పత్రాలు రాయిస్తున్నామని, వీటంటన్నిటినీ తహసీల్దార్‌కు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, మణి, విజయ్ కుమార్, విజయగౌరి, రమాదేవి, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

పాలసముద్రం: పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశించారు. ఆయన గురు వారం పాలసముద్రం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున నాటుసారా విక్రయాలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయన్నారు. అలాగే ఇసుక, ఎర్రచందనం రవాణాను అరికట్టాలని సూచించారు. సరిహద్దులో ప్రత్యే నిఘా పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో పర్యటించి గొడవలు జరగకుండా చూడాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కి పరిమితం కాకుండా గ్రామాల్లో తిరుగుతూ శాంతి భద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్‌ఐ రమణరావ్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారు పట్టణ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

జోనల్ స్పోర్ట్స్‌మీట్ రేపు

పుంగనూరు: పట్టణంలోని భాష్యం పాఠశాలలో ఈనెల 8న జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సుబ్రమణ్యం గురువారం తెలిపారు. భాష్యం విద్యాసంస్థలతో నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌మీట్‌లో మదనపల్లె, తిరుపతి, పుంగనూరు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. స్పోర్ట్స్‌మీట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

ఆటో ఢీ: యువకుడి మృతి

పలమనేరు: బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని మండిపేట కోటూరుకు చెందిన ప్రతాప్‌కుమార్(25) గురువారం బైక్‌లో పలమనేరుకు బయలుదేరాడు. మండిపేట కోటూరు సమీపంలో వెళుతుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో వెళుతున్న ప్రతాప్‌కుమార్ మృతిచెందాడు.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణలో పెన్షనర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ప్రయోజనాలను అధికారులు తెలియజేయాలన్నారు. అనంతరం పెన్షనర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు రామ్మూర్తి, కుమారవర్మ, నారాయణస్వామి, ఏకాంబర నాయుడు, కోదండనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో పోలీసులు

వెదురుకుప్పం: మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపరిచిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆయన గురువారం వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బ్రాహ్మణపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి ఈనెల 3వ తేదీ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో చవటగుంట సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బ్రాహ్మణపల్లె దళితవాడకు చెందిన రజనీ కాంత్, మారేపల్లె దళితవాడకు చెందిన పవన్, చింతలగుంటకు చెందిన జ్యోతీశ్వర్ రెడ్డి ఆపారు. చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో దాడి చేశారు. శంకర్‌రెడ్డికి రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్టెమీతో గుండెపోటు నుంచి రక్షణ



స్టెమీ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఐరాల: స్టెమీ చికిత్సతో గుండె పోటు నివారించి తద్వారా మరణాల సంఖ్యను తగ్గించవచ్చని పూతలపట్టు మండలం పీ.కొత్తకోట సీహెచ్‌సీ వైద్యాధికారి కుమార్‌రాజా, డాక్టర్ వెంకటేశ్వర రావు తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వారు స్టెమీ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలి కారణంగా పెరుగుతున్న మరణాలకు గుండెపోటు ఓ కారణమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గుండెపోటుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఛాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండె దడ, స్పృహ కోల్పోవడం.. తదితర లక్షణాలు కనిపిస్తే గుండెపోటుగా భావించి వెంటనే అప్రమత్తమై గంటలోపే వైద్యులను సంప్రదించాలన్నారు. గుండె పోటు నుంచి అత్యవసరంగా కాపాడటానికి సీహెచ్‌సీలో రూ.45 వేల విలువ చేసే టెనెక్టేప్లస్ ఇంజెక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టి ఉంటే ఈ మందు గడ్డను కరిగిస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెర్సీ ఆవులతో అధిక పాల దిగుబడి



కూర్మాయిపల్లెలో రైతులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్

బంగారుపాళెం: జెర్సీ ఆవులతో అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని కూర్మాయిపల్లె గోపాల మిత్ర కేంద్రం ఆవరణలో పశుసంతతి పరిశీలనా పథకం ద్వారా పుట్టిన సంకర జాతి జెర్సీ పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభాకర్ మాట్లాడారు. పేయదూడల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. పీటీపీ పేయదూడలు, కోడెదూడల ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో 70 దూడలను ప్రదర్శించారు. ఉత్తమ పేయదూడలను ఎంపిక చేసి యజమానులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ ఆరిఫ్, బాలసుబ్రమణ్యం, సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ ఆసీఫ్, నలగాంపల్లె పశువైద్యాధికారి ఝాన్సీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లపైనే మృత్యు తీగలు

- సమస్య నివేదించినా పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



గ్రామంలో ఇళ్ల మధ్య వేలాడుతున్న కరెంటు తీగలు



బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో నివాస గృహాలపై కరెంటు తీగలు మృత్యు తీగల్లా గ్రామస్తులకు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో పలు ఇళ్లపై కరెంటు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం కురిస్తే ఇళ్లకు కూడా విద్యుత్ ప్రసరిస్తోందని, దీంతో గృహనిర్మాణ పనులను సైతం చేసుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని గ్రామస్తులు తమ ఆక్రోశం వెలిబుచ్చారు. ఇటీవల గృహ నిర్మాణ పనులు చేస్తుండగా మేస్త్రీలు కరెంటు షాక్ గురయ్యారని చెప్పారు. గ్రామంలో ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు, విద్యుత్ స్తంభాలను మార్చాలని పలుమార్లు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావడంతో తాను ట్రాన్స్‌కో అధికారులకు నివేదించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక సర్పంచ్ నిర్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగల లైన్లను మార్చాలని విజ్ఞప్తి చేశారు.

ఉసిరి ప్రయోజనాలపై అవగాహన



మాట్లాడుతున్న కరీముల్లా

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉసిరి ఆరోగ్య ప్రయోజనాలపై రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా దంపతులు గురువారం అవగాహన కల్పించారని హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన 175 కిలోల ఉసిరి కాయలను వారు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. ఉసిరితో అనేక ఔషధ ప్రయోజనాలు ఉన్నట్లు వారు వివరించారని తెలియజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడుపు కొడుతున్నారు

- ఆర్పీని తొలగించాలని ఎమ్మెల్యే కార్యాలయం ఒత్తిళ్లట!
- ఇది సిటీ మిషన్ మేనేజర్ సమాధానం
- బాధితురాలి ని'వేదన'



మాట్లాడుతున్న బాధితురాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తాను ఓ చిరుద్యోగిని..తనకు లాగిన్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని చిత్తూరు నగరం11వ డివిజన్ ఆర్పీ అనిత తన ఆక్రోశం వెళ్లగక్కారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. చిత్తూరు నగర 11వ డివిజన్ పరిధిలో ఆర్పీగా ఇన్నాళ్లు వివాదరహితంగా విధులు నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. తాను ఏ తప్పూ చేయలేదని, అలాగే ఏ పార్టీకి కూడా పని చేయలేదన్నారు. అయితే కొందరు తనపై ఫిర్యాదు చేశారని, తనను తొలగించాలని ఎమ్మెల్యే ఆఫీసు నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయంటూ సిటీ మేనేజర్ రమణ తనకు కొన్ని రోజుల నుంచి లాగిన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై కలెక్టర్‌కు గత నెల 22న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదు చేశానన్నారు. డివిజన్‌లోని సంఘ సభ్యులతో సమావేశం నిర్వహిస్తే సభ్యులంతా తనకు మద్దతు పలికారన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

ఇంటింటికీ వైద్యం



నలిశెట్టిపల్లెలో గర్భవతికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ



జొన్నగురకలలో రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: ఇంటింటికీ వైద్యసేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ ముఖ్యోద్దేశమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ అన్నారు. గురువారం మండలంలోని నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించారు. . శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ హరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జొన్నగురకలలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. రోగులను పరీక్షించారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వసంతాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంధ్య రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలను ఇచ్చారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. సిబ్బంది ఉమామహేశ్వరి, జబసెల్వి, సరస్వతి, చంద్రశేఖర్, సుజిమ, స్వప్న పాల్గొన్నారు.

ఇరువారంపల్లెలో..

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది ఇచ్చే ఐరన్ మాత్రలు విధిగా వాడాలన్నారు.

రోడ్లపై నూర్పిడి



రోడ్డుపై వేసిన ఉలవ పంట

మండలంలో పలువురు ఉలవలు సాగు చేశారు. చేతికొచ్చిన పంట కోతలు కోసి నూర్పిళ్ల కోసం రోడ్లను ఉపయోగిస్తున్నారు. ఉలవ పంటను రోడ్లపై అడ్డంగా వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –సదుం